క్లుప్తంగా

కొండపోచమ్మ పునరుద్ధరణ పనులు ప్రారంభించండి



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన జగదేవ్‌పూర్‌లోని కొండపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరుతూ మంగళవారం ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. కొండపోచమ్మ ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ కోట్ల నిధులు మంజూరు చేశారని, నాలుగేళ్లు దాటుతున్న అభివృద్ధి పనులు జరగడం లేదని ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి స్పందిస్తూ కొండపోచమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ కనకయ్య, సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు మరింత విస్తృతం

హుస్నాబాద్: ఆర్టీసీ ద్వారా విశిష్ట సేవలు అందించేందుకు ప్రతీ గ్రామానికి వీబీఓ (గ్రామ బస్సు అధికారి)లను నియమించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం డిపోలో ఆయన మాట్లాడుతూ.. డిపో పరిధిలోని 5 మండలాలకు 20 మంది సిబ్బందిని గ్రామ బస్సు అధికారులుగా నియమించామన్నారు. ఈ నెల 9న వీబీఓ సేవలను లాంచింగ్ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి వీబీఓకు ఒక కిట్‌ను అందజేసి, గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డుపై వీబీఓ పేరు, ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఆర్టీసీని ఆదరించి డిపో అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఆయన కోరాడు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: పేరిణి కళాకారులు డాక్టర్ నటరాజ రామకృష్ణ వర్ధంతి సందర్భంగా భవాని క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. పేరిణి, ఆంధ్రనాట్యం, కూచిపూడిలలో కొన్ని రోజులుగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డిలు శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వినోద్‌గౌడ్, నాగరాజురెడ్డి, అకాడమీ నిర్వాహకులు భవాని పాల్గొన్నారు.

స్వయంభూ రాజేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారి సన్నిధిలో మొరంశెట్టి రాములు, భక్తులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో గో సేవ భజన మండలి సభ్యులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోశాలను సందర్శించి పందిల్లలోని నిత్యాన్న దాన సత్రంలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో టీటీడీ ఆలయ కమిటీ డైరెక్టర్ మొరంశెట్టి రాములు మాట్లాడుతూ.. త్వరలోనే పంచగవ్య గో ఉత్పత్తులను తయారు చేసి గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాదిశెట్టి శ్రీధర్, యాదలక్ష్మి, మమత పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

సిద్దిపేటఅర్బన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగించినట్లు త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. సిద్దిపేటలోని కాళ్లకుంట కాలనీకి చెందిన షాదుల్ ఈ నెల 3న పెయింటింగ్ పని నిమిత్తం కొండపాక మండలం సిర్సినగండ్ల గ్రామానికి వెళ్లాడు. అక్కడ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ యాప్‌లో ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. ఫోన్ దొరికిన వ్యక్తి తన సిమ్‌కార్డును అందులో వేసుకోగానే అతని వివరాలు గుర్తించి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి ఫోన్‌ను అప్పగించారు.

అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి

మద్దూరు మండల సభలో ఎంపీపీ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపిడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, రెవెన్యూ, విద్యుత్, వైద్యం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, అబ్కారి శాఖల పనితీరుపై చర్చించారు.

- మండల వ్యాప్తంగా వడగండ్ల వానతో దాదాపు 12వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం జరిగిందని ఏఓ రామకృష్ణ తెలిపారు. యాసంగిలో కొత్త పాస్‌బుక్ వచ్చిన వారికి ఎందుకు రైతుబంధు డబ్బులు రావడం లేదని పలువురు ఏఓను ప్రశ్నించగా.. యాసంగిలో కొత్తవారికి డబ్బులు పడలేదు. ఈ సారి వారికి రైతుబంధు డబ్బులు అకౌంట్‌లో జమవుతాయన్నారు.
- అదేవిధంగా మద్దూరు మండల కేంద్రంలోని వైకుంఠధామానికి గ్రామానికి చెందిన వ్యక్తి నక్షబాటను చెడగొట్టి అటువైపు వెళ్లకుండా అడ్డు పడుతున్నాడని సర్పంచ్ జనార్దన్‌రెడ్డి వాపోయాడు. దీనిపై స్పందించిన తహసీల్దార్ భూపతి ఆర్ఐ, సర్వేయర్‌ను పంపించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.
- తోర్నాల గ్రామంలో 11కేవీలో సమస్య ఉందని ప్రతి మండల సభలో చెప్పినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని, ధాన్యం కొనుగోలు సమయంలో లారీలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో లూజ్‌వైర్లతో సమస్య ఉందని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన విద్యుత్ అధికారులు త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా హనుమతండాకు సబ్‌స్టేషన్ మంజూరైందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.
- గొల్లకురుమలకు ప్రభుత్వం అందిస్తున్న గొర్రెల పంపిణీల లిస్ట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల పేరు ఎందుకు వచ్చాయని పశుసంవర్ధకశాఖ అధికారి హరికిషన్‌ను ప్రశ్నించగా.. అలాంటిది ఏమి జరగలేదని మళ్లీ ఒకసారి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి లిస్ట్ ఫైనల్ చేస్తామన్నారు.
- సలాఖపూర్ హైస్కూల్‌ను ఎలాంటి తీర్మానాలు లేకుండా ఎందుకు కూల్చారని ఎంపీటీసీ రాజేశ్వర్‌రెడ్డి పీఆర్‌ఏఈని ప్రశ్నించగా మన ఊరు మన బడిలో నూతన భవన నిర్మాణం కోసం కూల్చామన్నారు.
- వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామాల్లోని బాలింతలు, మహిళలకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదని వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలతమల్లేశం వారిపై మండిపడ్డారు.
- ఈ నెల 2 నుంచి ప్రారంభమైన దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.
- అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.
- అంతకుముందు సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికే కొండాపూర్, జాలపల్లి ఎంపీటీసీలు సభ నుంచి వెళ్లిపోయారు. దీనిపై వారిని ప్రశ్నించగా ఎంపీటీసీలుగా గెలిచి 4 సంవత్సరాలు అవుతున్నా గ్రామాల అభివృద్ధికి ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెళ్లామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు జవాబుదారీగా పనిచేయాలి

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడ(హుస్నాబాద్): ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు జవాబుదారీగా పనిచేయాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. రేపు చెరువుల వద్ద నిర్వహించే పండగను సాయంత్రం 6 గంటలలోపు పూర్తి చేయాలన్నారు. అంతకుముందు సభ్యులు పలు సమస్యలను సభలో ప్రస్తావించారు. పరివేద, నకిరెకొమ్ముల రోడ్డు కల్వర్టులను త్వరగా పునరుద్ధరించాలని ఎంపీటీసీ బాపయ్య కోరారు. ఉపాధి హామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించడం లేదన్నారు. కల్వర్టు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కూలీలకు అందించాలని ఎంపీపీ కొక్కుల కీర్తి ఆయా అధికారులను ఆదేశించారు. మైసంపల్లిలో మిషన్ భగీరథ నీరు సరఫరా అవడం లేదని సర్పంచ్ రవీందర్‌గౌడ్ అన్నారు. విజయనగర్ కాలనీ, ఎర్రకుంటపల్లి, వింజపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు రాజేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లయ్య కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, కోహెడ ఫ్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు, తహసీల్దార్ జావిద్‌అహ్మద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సురేశ్ పాల్గొన్నారు.

మెరుగైన ఆరోగ్యానికి క్రీడలు అవసరం



జగదేవ్‌పూర్(గజ్వేల్): 3కే రన్‌లో పాల్గొన్న ప్రతాప్‌రెడ్డి

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదపడతాయని, యువతకు ఉపాధి కోసం మునిగడప ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తామని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో మునిగడపలో 3కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునిగడపలో 412 ఎకరాల భూమి ఉందని, ఆ స్థలంలో పరిశ్రమ ఏర్పాటుకు సీఎం కేసీఆర్, మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కంపెనీ ఏర్పాటుతో వందల మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. యువత ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రన్‌లో ప్రతిభ చాటిన వారికి ఉత్సవాల ముగింపు రోజు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాల్‌లక్ష్మి, భిక్షపతి, రాజేశ్వరి, ఎస్ఐ కృష్ణమూర్తి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): విజేతలతో సీఐ కృష్ణ తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): వ్యాయామంతోనే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. మిరుదొడ్డి పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం 5కే రన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, తొగుట ఏపీఓ ఎర్రోల్ల కిషన్, సర్పంచ్ రాములు, ఉపసర్పంచ్ కనకయ్య, ఎంపీటీసీ రాములు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కమలాకర్‌రెడ్డి, నాయకులు లింగం, అంజిరెడ్డి, దేవరాజు, మిరుదొడ్డి, దుబ్బాక ఎస్ఐలు శ్రీధర్‌గౌడ్, మహేందర్, సిద్దిపేట జిల్లా రన్నర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, నునిగారి రాజు, ధర్మారం కుమార్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



బీటీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రాయపోలు(దుబ్బాక): రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. రూ.44లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపడుతున్న రాయపోలు మండలం అంకిరెడ్డిపల్లి-రాంసాగర్ బీటీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నాణ్యతతో చేపట్టాలని అధికారులను, గుత్తేదారును ఆయన కోరారు. ఏళ్లపాటు గుంతలమయమైన రోడ్డు మరమ్మతు చేపట్టాలని స్థానికులు పలుమార్లు విన్నవించుకోగా రోడ్డు నిర్మాణానికి నిధుల కోసం కృషి చేసినట్లు ఆయన చెప్పారు. పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట అంకిరెడ్డిపల్లి సర్పంచ్ వెంకటనర్సింహారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మాదాసు వెంకట్‌గౌడ్, నాయకులు దయాకర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, కొంగరి స్వామి, సుఖేందర్‌రెడ్డి తదితరులున్నారు. అంతకుముందు అంకిరెడ్డిపల్లిలో ఇటీవల అగ్ని ప్రమాదంలో మృతి చెందిన మల్లారెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే విధంగా కొత్తపల్లిలో ఇటీవల మృతి చెందిన ఎర్రోళ్ల లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్‌లో జరుగుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి సిద్దియోగ మహోత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రఘునందన్‌రావును సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. సిద్ది మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఎమ్మెల్యే సొంత ఖర్చులతో అన్నదానం చేశారు.

వైద్య సిబ్బందికి సన్మానం



వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న డాక్టర్ అమీనా సుల్తానా తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి పీహెచ్‌సీ పరిధిలోని 10 గ్రామ పంచాయతీల్లో జనవరి 19 నుంచి ప్రారంభించిన కంటి వెలుగు వైద్య పరీక్ష శిబిరాలు మంగళవారంతో విజయవంతంగా ముగిశాయి. మొత్తం 16,333 మంది లక్ష్యం కాగా 11,815 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ అమీనా సుల్తానా, క్యాంపు మెడికల్ ఆఫీసర్ నీలోఫర్ తెలిపారు. సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అనంతరం వైద్య సిబ్బందిని సన్మానించారు.

టీఎస్ ఐపాస్‌తో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం

మర్కూక్(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ ఐపాస్‌తో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తుందని గజ్వేల్ ఆర్డీవో విజయేందర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పారిశ్రామిక విజయోత్సవ వేడుకలను కర్కపట్ల గ్రామంలోని పారిశ్రామిక కంపెనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు కావాలంటే ఇబ్బందులు ఎదురయ్యేవని, నేడు పరిశ్రమల స్థాపనకు టీఎస్ ఐపాస్ ద్వారా త్వరితగతిన అన్ని రకాల అనుమతులు ఇస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, పరిశ్రమల యాజమాన్యం పాల్గొన్నారు.

సంబరాలను విజయవంతం చేయండి

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈ నెల 9వ తేదీన నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న తెలంగాణ సంక్షేమ సంబరాలను విజయవంతం చేయాలని ఎంపీపీ మాలోతు లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని ఎంపీపీ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. అనంతరం ఎంపీపీ మాలోతు లక్ష్మి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాలకు మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు. అదే విధంగా మండలం నుంచి సుమారుగా 2వేల మందిని తరలించాలన్నారు. అదేవిధంగా ఈ నెల 8వ తేదీన ఊరూరా చెరువుల పండగను ఘనంగా నిర్వహించాలని సూచించారు. గ్రామం నుంచి డప్పులు, బోనాలు, బతుకమ్మ, మత్స్యకారుల వలలతో ఊరేగింపుగా చెరువు కట్టపైకి తరలాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ

దుబ్బాకరూరల్: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ పుష్పలత అన్నారు. దుబ్బాక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ కొత్త పుష్పలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో అటవీ శాఖకు సంబంధించిన వివరాలు సభలో చర్చించారు. అటవీ శాఖ అధికారిని ఏదైనా సమాధానం అడిగితే స్పందించడం లేదంటూ సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయని ఉపాధ్యాయుల కొరత ఉన్న విషయాన్ని సర్పంచ్‌లు జానర్దన్‌రెడ్డి, శంకర్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. వానాకాలం సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం సబ్సిడీపై అందించే వరి విత్తనాలు జైశ్రీరామ్ సన్న విత్తనాలు మన ప్రాంతంలో ఎక్కువ ధరకు లభిస్తున్నాయని, గజ్వేల్‌లో తక్కువ ధరకు విక్రయిస్తున్నారని సభలో వ్యవసాయాధికారులను నిలదీశారు. దశాబ్ది ఉత్సవాలను ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ ఎంపీపీ రవి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలను సాకారం చేయాలి



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎస్ఐ

రాయపోలు(దుబ్బాక): కన్నవారి కలను సాకారం చేసేందుకు యువత శ్రమించాలని దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్యరెడ్డి సూచించారు. దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్ తల్లిదండ్రులు సాయగౌడ్-ఈశ్వరమ్మల స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా టోర్నీలో ప్రథమ స్థానంలో నిలిచిన గజ్వేల్ జట్టుకు రూ.25వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన గొడుగుపల్లి జట్టుకు రూ.15వేల నగదు ప్రోత్సాహాలతో పాటు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, మండల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, తిర్మలాపూర్ ఎంపీటీసీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య



దుబ్బాకలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



హుస్నాబాద్: ఇంటింటా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

హుస్నాబాద్: బడి బాట కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ మా బడికి రండి అంటూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. మంగళవారం పలు వార్డుల్లో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బండారి మనీల మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తుందన్నారు. సైన్స్ ల్యాబ్, రీడింగ్ గది తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులను సమన్వయం చేసుకుంటూ విద్యార్థులు అడ్మిషన్లు పొందేలా, పిల్లలను సర్కార్ బడిలో చేర్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు హెచ్‌ఎం బండారి మనీల తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గూళ్ల రాజు, ఆర్‌పి కృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ మంగళవారం కిష్టాపూర్, అల్లీపూర్, రామంచ, సికింద్లాపూర్, చిన్నకోడూరు గ్రామాల్లో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలన్నారు.

దుబ్బాక: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని దుబ్బాక కేసీఆర్ పాఠశాల హెచ్‌ఎం గాజుల రాంచంద్రం అన్నారు. మంగళవారం ప్రభుత్వం ప్రతీ ఏటా చేపడుతున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూం కాలనీలో ఇంటింటా తిరుగుతూ.. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సక్కుబాయి, బాలకిషన్, ఉజ్వల, పద్మ, మధుసూదన్‌రెడ్డి, శ్రీశైలం, జ్యోతి, రామకృష్ణ, తదితరులున్నారు.

తొగుట(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని చందాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం సిద్దేశ్వర్ అన్నారు. మంగళవారం చందాపూర్‌లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకుడు చందారాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని మునిగడప గ్రామంలో బడి బాట కార్యక్రమంలో గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ బడిబాట ఆవశ్యకతలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు, సదుపాయాలు, మెరుగైన విద్యాబోధనలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మల్లమారి రవీందర్, రజిత, హెచ్‌ఎం రఘురాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల యువజన సంఘాల కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం బెజ్జంకిలో 35 యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అక్కరవేని పోచయ్య, ఉపాధ్యక్షులుగా కొత్త రాజ్‌కుమార్, జేరిపోతుల మధు, ఎంబరి సతీశ్, గాజె రాజు, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపెల్లి నరేశ్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా పులి రమేశ్, ఎర్రల రాజు, కొడిముంజ మహేందర్, జనుగాం రాజు, దయ్యాల నరేశ్, కోశాధికారిగా మిట్టపెల్లి చెన్నారెడ్డి, గౌరవ సలహాదారులుగా తిప్పారపు మహేశ్, మేకల నాగరాజు, కో-ఆర్డినేటర్‌గా కొర్వి రాజేందర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

◆ వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడిగా సత్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండల వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడిగా మునిగడప వీఆర్‌ఏ మన్నె సత్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వీఆర్‌ఏల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఆంజనేయులు, ఐలయ్య, శ్రీను, సంజీవులు, నర్సింలు, సతీష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్లమ్మ కల్యాణోత్సవాలు ప్రారంభం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్ ఎల్లమ్మ ఆలయంలో మూడురోజుల పాటు జరిగే ఎల్లమ్మ కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఎంపీపీ మాణిక్యరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కామునిశ్రీనివాస్, మాజీ సర్పంచ్ రామాగౌడ్, గౌడ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

◆ చెరువుల పండగకు విరాళం

మర్కూక్(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో 8న జరగనున్న ఊర చెరువుల పండగలకు మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య రూ.3లక్షలు విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు అన్ని గ్రామాల్లో చెరువుల పండగను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే నిధులకు అదనంగా తనవంతుగా మాజీ జెడ్పీటీసీ సత్తయ్య ప్రతి గ్రామ పంచాయతీకి 20 వేలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అశోక్, భాస్కర్, ప్రసాద్, నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.

◆ బీమాతో భరోసా

వర్గల్(గజ్వేల్): పార్టీ సభ్యత్వం ద్వారా సమకూరే బీఆర్‌ఎస్ బీమా పథకం కార్యకర్తలకు భరోసాగా నిలుస్తుందని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఇటీవల వర్గల్ మండలం జబ్బాపూర్‌లో పార్టీ కార్యకర్త పయ్యావుల స్వామి మృతి చెందగా మంజూరైన రూ. 2లక్షల పరిహారం చెక్కును మంగళవారం ఆయన గ్రామం సందర్శించి కుటుంబీకులకు అందజేశారు.

◆ శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం జ్యోతి

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని ఖమ్మంపల్లి హైస్కూల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరాన్ని హెచ్‌ఎం జ్యోతి ప్రారంభించారు. చిత్ర లేఖనం, మ్యూజిక్, పాఠ్యపుస్తకాలకు సంబంధించిన అంశాలపై 5రోజుల పాటు శిక్షణ నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతలు వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరం ఏర్పడడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మెలుగు బాల్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ బియ్యం, నగదు అందజేత

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి గ్రామానికి చెందిన పిట్ల కిష్టయ్య ఇటీవల జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చిన అబ్దుల్‌కలాం సేవా సంస్థ ప్రతినిధులు రూ.5వేల నగదు, 50కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కరుణాకర్, ఉపసర్పంచ్ ఎల్లేశం, ప్రతినిధులు రాజు, సురేశ్, మల్లయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.